సాక్షి
రంగారెడ్డి
ఆదివారం । 24 । డిసెంబర్ । 2023



బాటిళ్ల మయం

ఇబ్రహీంపట్నం మండలం కప్పపహాడ్ ప్రభుత్వ పాఠశాల మందుబాబులకు అడ్డాగా మారింది. 8లో▸



కారుతో బీభత్సం

మద్యం మత్తులో ఓ వ్యక్తి కారుతో బీభత్సం సృష్టించిన సంఘటన శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. 8లో▸



చేవెళ్ల: శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన స్వామివారు



ఆనంద క్షణాలు







మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా హకీంపేట పరిధిలోని సీఐఎస్ఎఫ్‌కు చెందిన నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీ (ఎన్ఐఎస్ఏ)లో శనివారం ఇన్‌స్పెక్టర్ల పాసింగ్ అవుట్ పరేడ్ (దీక్షాంత్ పరేడ్) ఘనంగా జరిగింది. శిక్షణ పూర్తి చేసుకున్న ఇన్‌స్పెక్టర్లు కుటుంబ సభ్యులతో ఫొటోలు దిగారు.

– సాక్షి, సిటీబ్యూరో

వైకుంఠ వైభవం

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని శనివారం వేంకటేశ్వర స్వామి ఆలయాలను సుందరంగా ముస్తాబు చేశారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేకువ జాము నుంచే ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు క్యూ కట్టారు. గోవింద నామస్మరణతో దేవాలయాలు మార్మోగాయి. ఎటు చూసినా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. చిలుకూరులో వైకుంఠ ద్వారం (ఉత్తర ద్వారం) లేకున్నా పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.



పహాడీషరీఫ్: మామిడిపల్లిలోని బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బారులు తీరిన భక్తులు



మొయినాబాద్: చిలుకూరు బాలాజీ దేవాలయంలో గోవింద నామస్మరణ చేస్తున్న భక్తులు

మళ్లీ కోవిడ్ కలకలం

గ్రేటర్‌లో వారంలో 36 కేసులు

- హైదరాబాద్‌లో 33, రంగారెడ్డిలో 3
- అప్రమత్తమైన వైద్య ఆరోగ్యశాఖ
- అనుమానితులకు పరీక్షలు



సాక్షి, రంగారెడ్డి జిల్లా: వాక్సినేషన్ తర్వాత పూర్తిగా కనుమరుగైపోయిందని భావించిన కరోనా వైరస్ మళ్లీ కలకలం సృష్టిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా కేవలం వారం రోజుల్లో 38 పాజిటివ్ కేసులు నమోదు కాగా, వీటిలో గ్రేటర్ పరిధిలోనే 36 రికార్డు కావడం ఆందోళన కలిగిస్తోంది. హైదరాబాద్ జిల్లాలో 33, రంగారెడ్డి జిల్లాలో మరో మూడు కేసులు నమోదయ్యాయి. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా కరోనా వైరస్ ఎప్పటికప్పుడు కొత్తగా రూపాంతరం చెందుతోంది. ఇప్పటికే అనేక మంది మృత్యువాతకు కారణమైన వైరస్ మళ్లీ పంజా విసురుతూ కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. వైరస్ ఉధృతి నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. చికిత్స కోసం గాంధీ కోవిడ్ ఐసోలేషన్ వార్డులో 50 ఆక్సిజన్, వెంటిలేటర్ పడకలను సిద్ధం చేసింది. నిలోఫర్ సహా ఇతర అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అనుమానితులకు వైద్య పరీక్షలు చేయడంతో పాటు ఇన్‌పేషంట్ చికిత్సల కోసం పడకలు సిద్ధం చేసింది. అవసరమైతే కొంతకాలంగా సర్వీసుకు దూరంగా ఉన్న టిమ్స్‌ను పునరుద్ధరించాలని నిర్ణయించింది. కోవిడ్ ఉధృతి నేపథ్యంలో పలు ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు ఆంక్షలు అమలు చేస్తున్నాయి. విద్యార్థులకు మాస్క్, శానిటైజర్ల తప్పనిసరి చేశాయి. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు,పోలీసు స్టేషన్లలోనూ మాస్క్ మస్ట్ చేయడంతో మార్కెట్లో మళ్లీ వాటికి డిమాండ్ ఏర్పడింది.

రూపాంతరం చెందుతూ..

ప్రపంచాన్ని గడగడలాండించిన కరోనా వైరస్ తొలిసారిగా 2019 డిసెంబర్ 31న చైనాలోని వూహాన్‌నగరంలో వెలుగు చూసింది. ఆ తర్వాత 2020 మార్చి 2న హైదరాబాద్ నగరంలో తొలి కోవిడ్ కేసు నమోదైంది. మొదటి వేవ్‌లో కోవిడ్ ఆల్ఫా వేరియంట్ విజృంభించగా, రెండో వేవ్‌లో డెల్టా వేరియంట్, మూడో వేవ్‌లో ఒమిక్రాన్ వేరియంట్ వెలుగు చూసింది. కొత్తగా ఒమిక్రాన్ జేఎన్1 వేరియంట్ రూపంలో మళ్లీ విజృంభిస్తోంది. మొదటి, రెండో వేవ్‌ల్లో అనేక మంది కోవిడ్ బారిన పడి మృత్యువాతపడ్డారు. ఉపాధి అవకాశాలు కోల్పోయి అనేక కుటుంబాలు రోడ్డున పడాల్సి వచ్చింది. వ్యాపార, వాణిజ్య సంస్థలు తీవ్రమైన సంక్షోభంలో కూరుకుపోయాయి. ప్రజా జీవితాన్ని అతలాకుతలం చేసిన వైరస్ మళ్లీ వెలుగు చూస్తుండటంతో వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. ఒక వైపు బాధితులకు చికిత్సలు అందిస్తూనే మరోవైపు నియంత్రణ చర్యలు చేపట్టింది. లాక్‌డౌన్‌ను అమలు చేసి వైరస్ వ్యాప్తిని కొంత వరకు కట్టడి చేసింది. వ్యాక్సిన్ అందుబాటులోకి తెచ్చింది. దశలవారీగా పదేళ్లు పైబడిన ప్రతి ఒక్కరికీ మూడు డోసుల వాక్సిన్ ఇప్పించింది. క్రమంగా వైరస్ తగ్గుముఖం పట్టడంతో అప్పటి వరకు అమల్లో ఉన్న ఆంక్షలను ఎత్తేసింది. ఇక కోవిడ్ పీడ పూర్తిగా విరగడైందని అంతా ఊపిరి పీల్చుకుంటున్న సమయంలో చాపకింద నీరులా విస్తరిస్తోంది. దీంతో వైద్య ఆరోగ్యశాఖ మళ్లీ అప్రమత్తమైంది. ఎలాంటి విపత్కర పరిస్థితులెదురైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఏర్పాట్లు చేసింది. ఆస్పత్రుల్లో ప్రత్యేక ఐసోలేషన్ వార్డులు, పడకలు, వైద్య సిబ్బందితో పాటు పీపీఈ కిట్లు, మాస్కులు, మందులు సిద్ధం చేసింది.

వారం రోజుల్లో నమోదైన కేసులు ఇలా..

తేదీ	హైదరాబాద్	రంగారెడ్డి
16	01	-
17	-	-
18	01	-
19	04	-
20	06	-
21	04	01
22	08	01
23	09	01

ఆందోళన చెందాల్సిన పనిలేదు

గత వేరియంట్లతో పోలిస్తే ప్రస్తుతం వెలుగు చూసిన జేఎన్-1 వేరియంట్ వైరస్ అంత ప్రమాదకరమేమీ కాదు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆస్తమా బాధితులు, కేన్సర్, మూత్ర పిండాలు, గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారు కాస్త జాగ్రత్తగా ఉండాలి. స్వీయ జాగ్రత్తలు పాటించడం ద్వారా వైరస్ బారినపడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. సాధ్యమైనంత వరకు జన సమూహంలోకి (ఫంక్షన్లు, సినిమాలు, మార్కెట్లు, తీర్థ యాత్రలు, విహార యాత్రలు) ఎక్కువగా వెళ్లక పోవడం ఉత్తమం. విధిగా మాస్క్ ధరించడం, శానిటైజర్లతో చేతులు శుభ్రం చేసుకోవడం ఉత్తమం. దగ్గు, జలుబు, జ్వరం వంటి లక్షణాలు కన్పిస్తే వెంటనే వైద్యులను సంప్రదించడం, రోగ నిర్ధారణ కోసం ఆర్టీపీసీఆర్, ర్యాపిడ్ యాంటిజన్ టెస్టులు చేయించుకోవాలి. ఒక వేళ పాజిటివ్ నిర్ధారణ అయితే వెంటనే ఐసోలేషన్‌లోకి వెళ్లాలి. వేళకు ఆహారం తీసుకోవడం, కంటినిండా నిద్ర పోవడం, రోగ నిరోధక శక్తిని పెంచుకోవడం ద్వారా వైరస్‌ను జయించొచ్చు.

– డాక్టర్ వెంకటేశ్వర్లు, డీఎంహెచ్ఓ, రంగారెడ్డిజిల్లా

సమస్యలను పరిష్కరించండి

పెద్దఅంబర్‌పేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్ : ప్రజాసమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనివ్వాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అధికారులను ఆదేశించారు. పెద్దఅంబర్‌పేట పట్టణ కేంద్రంలోని తారా కన్వెన్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పాలకవర్గ సభ్యులు, ఆయా శాఖల అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన పారిశుద్ధ్యం, వీధిదీపాలు, మురుగు కాల్వల శుభ్రతతో పాటు రోడ్లపై ఏర్పడిన గుంతలను తక్షణమే పూడ్చివేయించాలన్నారు. మున్సిపల్ పరిధిలో కొంతకాలంగా అపరిష్కృతంగా ఉన్న చెత్త డంపింగ్ యార్డు ఏర్పాటు కోసం ప్రజలకు ఇబ్బంది లేనటువంటి 20 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి నివేదికను సిద్ధం చేయాలని తహసీల్దార్ రవీందర్ దత్తుకు సూచించారు. సమావేశంలో 17 అంశాలను చర్చించి, తీర్మానించారు. మున్సిపల్ అభివృద్ధి కోసం హెచ్ఎండీఏ ద్వారా రూ.100 కోట్లు మంజూరు చేయాలని కోరుతూ లేఖను సిద్ధం చేయాలని కమిషనర్‌కు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో ఎక్కడా రాజీ పడే ప్రసక్తే లేదని, రాజకీయాలను పక్కన పెట్టి పాలకవర్గం, అధికారులు ప్రజాసమస్యలను పరిష్కరించేందుకు కలిసి ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. మొదటిసారి మున్సిపల్ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేను చైర్‌పర్సన్ చెవుల స్వప్న, వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి, కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ మెంబర్లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గ్యారెల శ్రీనివాస్ గౌడ్, మోతె మనెమ్మ, వడ్డేపల్లి విద్యావతి, బొర్ర అనురాధ, పసుల రాజేందర్, పండుగల జయశ్రీ, చల్లూరి మురళీధర్ రెడ్డి, మల్ రెడ్డి దీపిక, సామ అనూష, పబ్బతి లక్ష్మణ స్వామి, మద్ది నరేందర్ రెడ్డి, తొండపు రోహిణి రెడ్డి, పాశం అర్చన దేవిడి గీత, మండల కోటేశ్వరరావు, రమావత్ పరుశురాం, జోర్క గీత, ఓరుగంటి సుజాత, చెవుల హరిశంకర్, సిద్దెంకి కృష్ణా రెడ్డి, కందాడ అనుపమ, కో ఆప్షన్ సభ్యులు శంకరయ్య గౌడ్, హాజీరా బేగం పాల్గొన్నారు.

27న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ సెలక్షన్స్

తాండూరు టౌన్: ఈ నెల 27న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ సెలక్షన్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మధు, సహాయ కార్యదర్శి రాములు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని పాత శాలి వాహన కళాశాల మైదానంలో అండర్–14,16 విభాగంలో రన్నింగ్, లాంగ్‌జంప్, షాట్‌పుట్ క్రీడాకారుల ఎంపిక ఉంటుందన్నారు. పోటీలకు హాజరయ్యే వారు జనన ధ్రువీకరణ పత్రం తప్పక తీసుకురావాలని సూచించారు. 19వ జాతీయ జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ మీట్ సందర్భంగా ఈ ఎంపిక నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు. మరిన్ని వివరాలకు 8978234447, 6300075229 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

న్యూస్‌రీల్

విద్యుదాఘాతంతో రైతు దుర్మరణం

ఇబ్రహీంపట్నం రూరల్: పౌల్ట్రీఫాంలో బల్బు సరి చేస్తుండగా విద్యుత్ షాక్ గురై రైతు మృతి చెందాడు. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం మండలం నెర్రపల్లి గ్రామంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, బంధువుల కథనం ప్రకారం.. ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లి గ్రామానికి చెందిన గుండ్ల బాలకిషన్‌గౌడ్ (48) నెర్రపల్లి గ్రామంలోని బావమరిది పొలంలో ఉన్న పౌల్ట్రీఫాంలో బల్బు రావడం లేదని సరి చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ కొట్టింది. ఈ ప్రమాదంలో బాలకిషన్‌గౌడ్ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కొడంగల్ విద్యార్థికి గోల్డ్‌మెడల్

జాతీయ స్థాయి పరుగు పందెం పోటీలకు ఎంపికైన కిరణ్

కొడంగల్ రూరల్: రాష్ట్ర స్థాయి పరుగు పందెం పోటీల్లో పట్టణానికి చెందిన విద్యార్థి కిరణ్ బంగారు పతకం సాధించారు. శనివారం కామారెడ్డిలో నిర్వహించిన క్రాస్ కంట్రీ 15 వందల మీటర్ల పరుగు పందెం పోటీల్లో విజయం సాధించిన కిరణ్ బీహార్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని రంగారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ కోచ్ తిప్పన్న సాయిరెడ్డి తెలిపారు. హైదరాబాద్ సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో విద్యార్థి కిరణ్ అథ్లెటిక్స్‌లో శిక్షణ పొందుతున్నాడని.. శిక్షణ సమయంలోనే రాష్ట్ర స్థాయిలో విజయం సాధించడం విశేషమని అన్నారు. కాగా విజేతలకు ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి బహుమతులు అందజేశారు.

నీటి తడులతో దిగుబడి పెంపు

జిల్లా వ్యవసాయాధికారి గోపాల్

అనంతగిరి: వికారాబాద్ మండల పరిధిలోని నారాయణపూర్, ఆలంపల్లి తదితర గ్రామాల్లో శనివారం జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. యాసంగిలో విత్తిన శనగ పంటకు 35–40 రోజులకు, 55–65 రోజులకు తేలికపాటి నీటి తడి ఇస్తే దిగుబడులు పెరుగుతాయన్నారు. రైతులుతప్పకుండా వ్యవసాయాధికారుల సూచనలు పాటించి అధిక దిగుబడి సాధించాలన్నారు. ఆయన వెంట ఏఈఓ అనిల్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

ధ్యాన కేంద్రం.. ఉల్లాసభరితం



నృత్యం చేస్తున్న ధ్యానులు

- మహేశ్వర మహాపిరమిడ్‌లో మూడో రోజుకు చేరిన ధ్యాన మహాయాగాలు
- వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ధ్యానులు

కడ్తాల్: శాఖాహార జగత్తు నిర్మాణమే పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ లక్ష్యమని, పీఎస్ఎస్ఎం గ్లోబల్ ఫౌండర్ పరిమళ పత్రి అన్నారు. మహేశ్వర మహాపిరమిడ్ ధ్యాన కేంద్రంలో కొనసాగుతున్న పత్రీజీ ధ్యాన మహాయాగాలు శనివారానికి మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఉదయం 5 నుంచి 8 గంటల వరకు సంగీత వేణునాద గానంతో ప్రాతఃకాల ధ్యానం నిర్వహించారు. అనంతరం ధ్యానులనుద్దేశించి పరిమళ పత్రి ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ సరైన ఆధ్యాత్మిక పుస్తకాలు చదివి ఆత్మజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరిలో ప్రాపంచిక ఎదుగుదలతో పాటు, ఆధ్యాత్మిక ఎదుగుదల ఉండాలని అన్నారు. అనంతరం సౌత్ అమెరికా నుంచి వచ్చిన మాస్టర్ నిలోడెల్ మోంటే తన ధ్యాన అనుభవాలను వివరించారు. ఈ సందర్భంగా థింకింగ్ ఆఫ్ డెస్టిని, వైజాగ్ రమాదేవి తెలుగులో అనువదించిన ఆలోచన గమ్యం, గిరినాథరావు రచించిన ఆత్మోపదేశం అనే పుస్తకాలను ఆవిష్కరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు గురువులు ఆధ్యాత్మిక, ధ్యాన సందేశం వినిపించారు. పిరమిడ్ మాస్టర్లు తమ ధ్యాన అనుభవాలను వివరించారు. కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, ధ్యాన గురువులు స్వర్ణమాల పత్రి, పరిణీత పత్రి, ట్రస్ట్ సభ్యులు, మేనేజింగ్ ట్రస్టీ, పీఎంసీ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన ధ్యానులు

మంచోడే.. కానీ దొంగోడు!

దోచిన సొమ్ము గ్రామాభివృద్ధికి..

- జూబ్లీహిల్స్ ప్రాంతంలోనే చోరీలు
- సీసీ కెమెరాలకు చిక్కకుండా వ్యూహాలు
- ముంబై నుంచి రాకపోకలు
- పోలీసులకు చిక్కిన నేరగాడు రాబిన్‌హుడ్





మహ్మద్ ఇర్ఫాన్ అలియాస్ రాబిన్ హుడ్

బంజారాహిల్స్: దొంగలందు ఈ దొంగ వేరయా.. అన్నట్లు.. పెద్దలను దోచి పేదలకు పంచిపెడుతుంటాడు. చోరీ చేసిన సొత్తులో కొంత భాగాన్ని తన గ్రామాభివృద్ధికి ఖర్చు చేస్తాడు. కేవలం బంగారం, నగదు మాత్రమే తస్కరిస్తూ వెండి వస్తువుల జోలికి వెళ్లడు. సీసీ కెమెరాలకు చిక్కకుండా పక్కా ప్రణాళికతో ఒక ఇంటిపై నుంచి మరో ఇంటిపైకి దూకుతూ జారుకుంటాడు. జూబ్లీహిల్స్‌లోనే దొంగతనాలకు పాల్పడతాడు తప్ప నగరంలోని మరో ప్రాంతంపై దృష్టి పెట్టడు. పోలీసులకు ఏమాత్రం క్లూ దొరక్కుండా సెల్‌ఫోన్ సిమ్ వేసుకోకుండా కేవలం నెట్‌తో వాట్సాప్ కాల్స్ మాత్రమే వాడుతూ అత్యంత పకడ్బందీగా హైదరాబాద్, ముంబై మధ్య రాకపోకలు సాగిస్తున్నాడు. నాలుగేళ్లుగా బెంగళూరు, ఢిల్లీ, హైదరాబాద్ పోలీసులు గాలిస్తున్న ఈ అంతర్రాష్ట్ర దొంగను ఎట్టకేలకు జూబ్లీహిల్స్ క్రైం పోలీసులు అరెస్ట్ చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి.

సీసీ కెమెరాకు చిక్కి..

బిహార్‌కు చెందిన మహ్మద్ ఇర్ఫాన్ అలియాస్ రాబిన్‌హుడ్ అలియాస్ ఉజ్వల్ (33) ఢిల్లీ, బెంగుళూరు, హైదరాబాద్‌లలో దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. ఈ నెల 9న జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 10సిలోని ఎంపీ ఎమ్మెల్యే కాలనీలో నివసించే ధృవ అనురాగ్‌రెడ్డి ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. బంగారు నగలు తస్కరించి అదే రోజు రాత్రి ఇక్కడి నుంచి ఉడాయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసుకొని రంగంలోకి దిగారు. ఎంపీ ఎమ్మెల్యే కాలనీలో నాలుగైదు రోజులపాటు 75కిపైగా సీసీ కెమెరాలను వడపోసినా ఎక్కడా ఇర్ఫాన్ ఆనవాళ్లు చిక్కలేదు. సీసీ ఫుటేజీలు పరిశీలిస్తూ వెళ్తుండగా వెంకటగిరి సమీపంలో ఓ ఇంటి ముందు ఏర్పాటు చేసిన కెమెరాకు చిక్కాడు.

లక్డీకాపూల్‌లోని హోటల్‌లో మకాం..

పాత నేరస్తుల ఫొటోలను, సీసీటీఎన్ఎస్ పరిశీలనలో రాబిన్‌హుడ్ మామూలోడు కాదని, కరడుగట్టిన అంతర్రాష్ట్ర దొంగ అని తేలింది. నగరానికి దొంగతనానికి వచ్చినప్పుడు తప్పనిసరిగా లక్డీకాపూల్‌లోని ఓ హోటల్‌లో తనకు అచ్చొచ్చిన గదిలో ఉంటున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారం రోజులపాటు ఆ హోటల్ వద్ద కాపు కాశారు. రాబిన్‌హుడ్ రాకను గుర్తించిన పోలీసులు అతన్ని అదే హోటల్ గదిలో అదుపులోకి తీసుకొన్నారు. విచారణ చేయగా ఈ నెల 8న దొంగతనానికి ఇక్కడికి వచ్చానని, ఓ ఖరీదైన కారులో జూబ్లీహిల్స్ ప్రాంతంలో తిరుగుతూ తనకు అనుకూలంగా ఏ ఇల్లు దొంగతనానికి సరిపోతుందో రెక్కీ నిర్వహించినట్లుగా చెప్పాడు.

ఓ ఇంటిపైనుంచి మరో ఇంటిపైకి దూకుతూ..

ఓ ప్రముఖ నటుడి ఇంటి పరిసర ప్రాంతాల్లో చూడగా అక్కడ ఏ మాత్రం అనుకూలంగా లేకపోవడంతో ఎంపీ ఎమ్మెల్యే కాలనీలో ధృవ అనురాగ్‌రెడ్డి ఇంటిని లక్ష్యంగా చేసుకొని దొంగతనానికి పాల్పడినట్లు వెల్లడించాడు. అదే రోజు రాత్రి ముంబైలోని తన రెండో భార్య బార్ గర్ల్ గుల్షన్ ఇంటికి వెళ్లానని, మళ్లీ దొంగతనం చేయడానికి రెండు రోజుల క్రితం అదే హోటల్‌కు వచ్చినట్లు తెలిపాడు. ప్రముఖులు, బడాబాబులు నివసిస్తున్న జూబ్లీహిల్స్‌లోని దొంగతనాలు చేస్తుంటానని, సీసీ కెమెరాలకు చిక్కకుండా ఒక ఇంటిపై నుంచి మరో ఇంటిపైకి 15 నుంచి 20 ఇళ్ల పైకప్పులు దూకుతూ వెళ్తుంటానని చెప్పాడు. తాను చోరీ చేసిన సొత్తులో 50 శాతం పేదలకు ఆహారం, స్కూల్ ఫీజులు, దుస్తులు, ఆస్పత్రుల ఫీజులు కడుతుంటానని చెప్పాడు. అందుకే తనకు రాబిన్ హుడ్ పేరు వచ్చినట్లు వెల్లడించాడు.

ముగ్గురు భార్యలు.. యువతితో ప్రేమాయణం

చోరీ సొత్తుతో స్వగ్రామంలో వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో ఉజ్వల్ అని పేరు పెట్టారని వెల్లడించారు. తన మొదటి భార్య పర్వీన్ బిహార్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ అని.. రెండో భార్య ముంబైలో బార్‌గర్ల్ అని.. మూడో భార్య కోల్‌కతాలో ఉంటోందన్నాడు. ఇటీవలే పూజ అనే యువతితో ప్రేమలో పడ్డట్లు పోలీసులకు వెల్లడించాడు. నిందితుడిపై హైదరాబాద్‌లో నాలుగు కేసులు, బెంగళూరులో 7, న్యూఢిల్లీలో 4 కేసులు నమోదై ఉన్నాయి. ఇళ్ల తాళాలు పగులగొట్టి తనతో తీసుకెళ్లే స్క్రూడ్రైవర్లు, రాడ్లతో అల్మారాలు తెరుస్తుంటాడని వాటిని స్వాధీనం చేసుకున్నట్లు జూబ్లీహిల్స్ డీఐ వీరశేఖర్ తెలిపారు.

రోడ్డుపైనే వ్యాపారం.. వెళ్లడమే భారం


పండ్ల దుకాణం వద్ద నిలిపి ఉన్న కారు

తుర్కయంజాల్: సాగర్ రహదారికి ఇరువైపులా వెలుస్తున్న పండ్ల దుకాణాలు, చిరు వ్యాపారుల బండ్లతో ప్రమాదం పొంచి ఉంచి. నిత్యం రద్దీగా ఉండే ఆ మార్గంలో అధికారులు, పోలీసులు కన్నెత్తి చూడకపోవడంతో ఇష్టానుసారంగా రోడ్డు ఆక్రమణ సాగుతోంది. సాగర్ రహదారిపై ఉన్న మలుపుల వద్ద ఏ మాత్రం ఖాళీ జాగా వదలకుండా దుకాణాలను ఏర్పాటు చేయడంతో, కొనుగోలుదారులు రోడ్డుపైనే వాహనాలను నిలుపుతున్నారు. దీంతో వేగంగా వచ్చే వాహనాల వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు రోడ్డుకు ఆనుకొని వెలిసిన దుకాణాలను తొలగించడంతో పాటు, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ సీహెచ్. శ్రీకాంత్‌ను వివరణ కోరగా.. రోడ్డుకు ఆనుకుని పండ్ల దుకాణాలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. వెంటనే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

ఎమ్మెల్యేకు టీజేఎంయూ నాయకుల వినతి


ఎమ్మెల్యే శంకర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

షాద్‌నగర్‌రూరల్: ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్(టీజేఎంయూ) రాష్ట్ర నాయకుడు స్వాములయ్య కోరారు. శనివారం యూనియన్ నాయకులు ఎమ్మెల్యేగా ఎన్నికైన వీర్లపల్లి శంకర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్వాములయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించినందుకు ప్రయాణికుల సంఖ్య విపరీతంగా పెరిగిందని అన్నారు. డిపోకు ఆదాయం పెరగడం సంతోషంగా ఉందని, కానీ ప్రయాణికులకు సరిపడా బస్సులు లేవని అన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం డిపోకు 20 బస్సులను పెంచి స్టాఫ్‌ను కేటాయించాలని అన్నారు. అనంతరం ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీజేఎంయూ నాయకులు పాష మియా, ఎస్‌జీ.రావు, రవిచంద్ర, సుగుణమ్మ, రాములు, అక్బర్, కృష్ణుడు, మహేష్, సరస్వతి, జ్యోతి, నరసయ్య, శంకరయ్య, వరలక్ష్మి, శ్యామల, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యాలయం.. బాటిళ్లమయం


బడిలో పగలగొట్టిన మద్యం సీసాలు

ప్రపంచ మేధా సంపత్తి పురుడు పోసుకునే క్షేత్రాలు పాఠశాలలు. అక్కడి నుంచి చిన్నారుల గమనం మొదలై సంఘ జీవితంలో భాగస్వాములు అవుతారు. అంతటి ప్రాధాన్యం ఉన్న బడుల్లో అసభ్య పనులు విస్తుగొలిపిస్తున్నాయి. మందుబాబులు అడ్డగా మార్చుకోవడంతో విద్యార్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ వెకిలి చేష్టలను నిలయంగా మారింది ఇబ్రహీంపట్నం మండలంలోని కప్పపహాడ్ ప్రభుత్వ పాఠశాల. సెలవు దినం వచ్చిందంటే చాలు మందుబాబులు ఆడిందే ఆట పాడిందే పాట అన్న చందంలాగా ఉంది. దేవాలయం లాంటి బడిలో పాడు పనులు చేస్తున్నారు. చెడు వ్యవహారాలను చూసి విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పటిష్ట చర్యలు తీసుకొని మందుబాబులు ఆగడాలు అడ్డుకోవాలని కోరుతున్నారు. – ఇబ్రహీంపట్నం రూరల్


చిందరవందరగా పడవేసిన ఖాళీ సీసాలు

నిలోఫర్‌లో మరో చిన్నారికి కోవిడ్ పాజిటివ్

నాంపల్లి: నవజాత శిశు సంరక్షణా కేంద్రం నిలోఫర్‌లో కోవిడ్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. శనివారం 51 మంది చిన్నారులకు పరీక్షలు నిర్వహించగా వీరిలో ఆరు నెలల చిన్నారికి కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు నిలోఫర్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి పేర్కొన్నారు. ప్రస్తుతం నిలోఫర్‌లో కోవిడ్ పాజిటివ్ కేసుల సంఖ్య మూడుకు చేరుకుంది. వీరందరూ నిలోఫర్‌లోని కోవిడ్ వార్డు ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. కోవిడ్ వ్యాప్తి దృష్ట్యా ఆసుపత్రిలో జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఆసుపత్రిలో చేరేవారికి కోవిడ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా ప్రతి ఒక్కరికీ మాస్క్‌ను తప్పనిసరి చేశారు. ఆసుపత్రి పరిసరాలను శానిటైజ్ చేస్తున్నారు. వైరస్ వ్యాప్తి కాకుండా సూర్యరశ్మి ఆసుపత్రి ఆవరణలో ఉండేలా ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలను కత్తిరించారు.

యువతే దేశానికి వెన్నెముక

వికారాబాద్ అర్బన్: స్వామి వివేకానంద ఆశయాలకు అనుగుణంగా యువత ముందుకు సాగాలని పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి సూచించారు. శనివారం స్థానిక బ్లాక్ గ్రౌండ్‌లో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా యువజన వారోత్సవాల్లో ఇరువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత దేశ అభివృద్ధి కోసం పాటు పడాలని పిలుపునిచ్చారు. యువశక్తి ఎంతో గొప్పదని ఉన్నతమైన భవిష్యత్తు కోసం కలలు కనాలన్నారు. ప్రభుత్వపరంగా యువతకు సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఉత్సవాలలో భాగంగా స్థానిక అంబేడ్కర్ భవనంలో జిల్లా స్థాయి యువజన ఉత్సవాల నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జిల్లా యువజన క్రీడల అధికారి హనుమంతరావు, సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో కారుతో బీభత్సం

ముగ్గురికి తీవ్ర గాయాలు


ప్రమాదానికి కారణమైన కారు

శంకర్‌పల్లి: మద్యం మత్తులో ఓ వ్యక్తి కారుతో బీభత్సం సృష్టించిన సంఘటన శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పత్తేపురం ఫ్లైఓవర్‌పై శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చందిప్ప గ్రామానికి చెందిన ప్రభాకర్(40) మద్యం తాగి మున్సిపల్ పరిధిలోని పత్తేపురం ఫ్లెవైర్‌పై కారుతో రెండు బైక్‌లు, ఒక కారును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరి వ్యక్తులతో పాటు కారులో ఉన్న ఒకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. నిందితుడు ప్రభాకర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు.

శేరిలింగంపల్లిలో మరొకరికి కోవిడ్ పాజిటివ్

గచ్చిబౌలి: శేరిలింగంపల్లిలో కోవిడ్ కేసుల సంఖ్య రెండుకు చేరింది. తాజాగా కోవిడ్ కేసు నమోదైనట్లు కొండాపూర్ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనురాగిని రెడ్డి తెలిపారు. లింగంపల్లికి చెందిన గర్భిణీ(20) ఆస్పత్రికి వచ్చింది. దగ్గు, జలుబు ఉండటంతో రాపిడ్ యాంటిజెన్ టెస్ట్ చేయగా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది.